జగనన్న ఆణిముత్యాలు

- విద్యకు సీఎం జగన్ అధిక ప్రాధాన్యం
- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలు అందజేత



పది, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 'జగనన్న ఆణిముత్యాలు' అవార్డులు అందుకున్న విద్యార్థులతో మేయర్ హరి వెంకటకుమారి, డీఈవో చంద్రకళ, తదితరులు



సభలో విద్యార్థులు

ఆరిలోవ: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు అభినందన కార్యక్రమం జరిగింది. తూర్పు నియోకవర్గంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో 2022–23 విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా శాఖ అధ్వర్యంలో ఆణిముత్యాలు పేరిట సన్మానం చేశారు. నియోజకవర్గ పరిధిలో తోటగరువు జెడ్పీహెచ్, కేడీపీఎం ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియట్‌లో డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ఉంది. ప్రతి నియోజకవర్గంలో పదో తరగతిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులు, ఇంటర్‌లో గ్రూపుల వారీగా ప్రతిభ కనబరిచి విద్యార్థులను ఆణిముత్యాలుగా గుర్తించి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. నియోజకవర్గంలో తొలి మూడు స్థానాల్లో తోటగరువు హైస్కూల్ విద్యార్థులు నిలిచారు. పదో తరగతిలో 569 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచిన కాశి శ్రావణ్‌కుమార్‌కు నియోజకవర్గం స్థాయిలో రూ.15 వేలుతో పాటు పాఠశాలలో టాపర్‌గా నిలిచినందుకు రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన మౌనికాప్రియకు రూ.10 వేలతో పాటు పాఠశాల నుంచి రూ.2 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన పురందేశ్వరికి రూ.5 వేలతో పాటు పాఠశాల నుంచి రూ.1000 నగదును మేయర్ హరివెంకటకుమారి, డీఈవో ఎల్.చంద్రకళ అందజేశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. అందులో భాగంగా పాఠశాలలను నాడు–నేడు పథకం కింద అభివృద్ధి, సౌకర్యాలు కల్పించడం, జగనన్న కిట్ల పంపిణీ, ఆధునిక విద్యా విధానం అమలు వంటి చర్యలు చేపట్టారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. అనంతరం డీఈవో చంద్రకళ మాట్లాడుతూ పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇది మంచి గుర్తింపు అన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలల్లోను మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే జేవీకే కిట్లు కూడా పంపిణీ చేశామని చెప్పారు. ప్రతి ఉన్నత పాఠశాలలో వాచ్‌మన్ నియామకాలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికైన వారిని ఆదర్శంగా తీసుకుని చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ పీడీ శ్రీనివాసరావు, తోటగరువు హెచ్ఎం దుర్గాభవాని, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, సభ్యుడు కె.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు సత్కారం

2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆణిముత్యాలు కార్యక్రమంలో నగదు ప్రోత్సాహం అందించారు. ఇంటర్‌లో నియోజకవర్గం స్థాయిలో ఎంపీసీలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎస్.సాయిమణి, బైపీసీలో ప్రథమ స్థానంలో నిలిచిన జామి మకరంద్, హెచ్ఈసీలో ప్రథమ స్థానంలో నిలిచిన డి.నరేంద్ర, సీఈసీలో ప్రథమ స్థానంలో నిలిచిన ఎం.మేఘనకు రూ.15,000 చొప్పున నగదుతో పాటు జ్ఞాపికలను మేయర్ హరివెంకటకుమారి, డీఈవో చంద్రకళ, అర్బన్ డీఐ కె.సువర్ణ అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా కళాశాల ఇంటర్మీడియట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో సత్తాచాటిన సాయిమణికి ప్రోత్సాహకం అందిస్తున్న మేయర్, డీఈవో, ప్రిన్సిపాల్

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..



పదో తరగతిలో 569 మార్కులు సాధించడానికి ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఉత్తమ బోధనతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సాహంతో పట్టుదలతో చదివా. ఇంటర్ తరువాత బి.టెక్ చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా. ఇందు కోసం ఇప్పటి నుంచే కష్టపడి చదువుతా.

– కాశి శ్రావణ్‌కుమార్, తోటగరువు హైస్కూల్, నియోజకవర్గ స్థాయి టాపర్

18న మాతృమూర్తి సేవా పురస్కారాల ప్రదానం

మద్దిలపాలెం: మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మాతృమూర్తి సేవా పురస్కారాలు ప్రదానోత్సవం నిర్వహించనున్నామని ట్రస్ట్ ప్రతినిధి మేడా మస్తాన్‌రెడ్డి తెలిపారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, ఏసీపీ సిహెచ్.వివేకానంద, ఏపీ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దాడి సత్యనారాయణ ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారన్నారు. ఈ పురస్కారాలను విశ్రాంతి మేజర్ జనరల్ టి.ఎస్.రావు, ఉన్నా రాంప్రసాద్, కాకపర్తి బాలాజీ, కాండ్రేగుల వెంటక సూర్య అప్పారావు, భీశెట్టి శ్రీనివాసరావు స్వీకరించనున్నారని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న 198 బెటాలియన్ సిబ్బంది

బీచ్ రోడ్డు: రక్తం సమయానికి అందక చాలా మంది మరణిస్తున్నారని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం చాలా అవసరమని 198 బెటాలియన్ సెకండ్ కమాండింగ్ ఆఫీసర్ నావల్ కిశోర్ చౌదరి అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బెటాలియన్ ప్రధాన కార్యాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బెటాలియన్ ద్వారా పాడేరు, విజయనగరం జిల్లాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. ఇలా సేకరించిన రక్తాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవీంద్ర సింగ్ సజ్వాన్, భగత్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

18న ఏఐవైఎఫ్ మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ సభ్యులు

ఆరిలోవ: అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా 11వ మహాసభను యువత జయప్రదం చేయాలని సమాఖ్య జిల్లా కన్వీనర్ వై.రాంబాబు పిలుపునిచ్చారు. ఆరిలోవ ప్రాంతం దుర్గాబజార్‌లో గురువారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 18న నగరంలో ఏఐవైఎఫ్ మహాసభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చరణ్, పవన్, సంజు, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మద్దిలపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–1లోని జేఆర్ నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్–1 ఈఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జేఆర్ నగర్, ఇసుకతోట, మద్దిలపాలెం, కృష్ణా కళాశాల ఏరియా, భానునగర్, కేఆర్ఎం కాలనీ ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ కాలనీ సెక్టార్–3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12 ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. 33/11 కేవీ ఎంవీపీ సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

'సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'



సమావేశంలో మాట్లాడుతున్న గంగయ్య

ఎంవీపీ కాలనీ: ప్రధాని మోదీ 9 ఏళ్ల సుపరిపాలనను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని బీజేపీ విశాఖ జిల్లా ఇన్‌చార్జి పుట్టా గంగయ్య కోరారు. పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తూర్పు నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఆర్ఎల్ఎన్ మురళీమోహన్‌రాజు అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో చేపట్టిన ప్రజారంజక పాలన, పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

శ్రీశ్రీకి ఘన నివాళి



శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

బీచ్ రోడ్డు: మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సందర్భంగా గురువారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పలువురు సాహితీవేత్తలు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీశ్రీ సాహిత్యాలను కళారూపాలుగా తీర్చిదిద్ది ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న ప్రజానాట్య మండలి సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రవంతి సీనియర్ నాయకులు చలపతి, ప్రజానాట్య మండలి కార్యదర్శి ఎం.చంటి, జి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసి పూజ

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవా, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమం కూడా చేశారు.

ఏయూ సమాచారం..

వర్సిటీ అభివృద్ధిపై హర్షం



వీసీ ప్రసాద రెడ్డిని కలిసిన ప్రేంబాబు తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సాధిస్తున్న అభివృద్ధిపై వైఎస్ఆర్‌సీపీ గ్రీవెన్స్ సెల్ విశాఖ అధ్యక్షుడు ప్రేమ్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జాతీయ స్థాయిలో వివిధ సంస్థలు విడుదల చేసిన ర్యాంకుల్లో ఏయూ అత్యుత్తమ స్థానాలను సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ వీసీ ప్రసాదరెడ్డిని ఆయన అభినందించారు. గత నాలుగు సంవత్సరాలుగా విశ్వవిద్యాలయంలో జరిగిన అభివృద్ధి ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సాయిరాం



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సాయిరాం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా ఈఎస్ఎస్ ఈఎస్ఎస్ వ్యవస్థాపకుడు, సంస్థ సంచాలకుడు సాయిరాం బొల్లాప్రగడ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ నుంచి ఆయన నియామక ఉత్తర్వులు స్వీకరించారు. విద్యార్థులను పరిశ్రమలకు అనుగుణంగా మలిచేలా సేవలు అందించాలని సాయిరాంకు వీసీ సూచించారు.

'సమాజ ఉపయుక్తంగా పరిశోధనలు'

ఏయూ క్యాంపస్: పరిశోధనలు సమాజ ఉపయుక్తంగా నిలవాల్సిన అవసరం ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీసెర్చ్ మెథడాలజీ రెండు వారాల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఏయూ హెచ్ఆర్‌డీసీ కేంద్రంలో బ్లెండెడ్ విధానంలో ఈ తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పరిశోధకులను ఉద్దేశించి రిజిస్ట్రార్ మాట్లాడుతూ ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్‌ని నెలకొల్పిన తొలి విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందన్నారు. పరిశోధన ఆసక్తిని గుర్తించి ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు. రెండు వారాల శిక్షణలో భాగంగా నిపుణులతో అవగాహన, ప్రత్యక్ష శిక్షణ అందిస్తూ, అవసరమైన మెలకువలు నేర్పనున్నట్లు చెప్పారు. వైవిధ్యమైన అంశాలపై పరిశోధనలు జరిపి ఏయూకు పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా ఆచార్య ఎన్.ఎ.డి.పాల్ వ్యవహరించగా.. ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా మంత్రి మేరుగు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు, పూర్వ విద్యార్థి డాక్టర్ మేరుగు నాగార్జున జన్మదిన వేడుకలు గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆచార్యులు కేట్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య జాలాది రవి, ఆచార్య చంద్రమౌళి, ఆచార్య పి.ప్రేమానందం, డాక్టర్ ఎస్.పుల్లారావు, డాక్టర్ శాంతారావు, డాక్టర్ బి.మోహన్‌బాబు, డాక్టర్ కల్యాణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజ్‌కుమార్, బోని శివరామకృష్ణ, రెల్లి కార్పొరేషన్ చైర్మన్ మధుసూదన్, విశ్రాంత పోలీసు అధికారి ప్రేమ్‌బాబు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వాక్‌థాన్



వాక్‌థాన్ చేస్తున్న సీనియర్ సిటిజన్స్

బీచ్ రోడ్డు: వృద్ధులను ప్రతి ఒక్కరు గౌరవించి తగిన స్థాయి కల్పించాలని కోరుతూ సాగరతీరంలో వాక్‌థాన్ నిర్వహించారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ జె.మాధవి పాల్గొని ఈ వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌లో సీనియర్ సిటిజన్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి

- ఆర్ఐవో సత్యనారాయణ



ఆర్ఐవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలేజీ నిర్వాహకులు

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యున్నతికి కాలేజీల నిర్వాహకుల పాటుపడాలని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ అన్నారు. ఆర్ఐవోగా నియమితులైన సత్యనారాయణను నగరంలోని ప్రైవేటు కాలేజీల నిర్వాహకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఐవో సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ విద్య ప్రాధాన్యత దృష్ట్యా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. చదువుతో పాటు సామాజిక దృక్పథం పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న గేదెల లావణ్య, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కార్పొరేటర్ గేదెల లావణ్య ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాల విద్యార్థులకు ఈ కిట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే దిశగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మహేశ్వరి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

బీచ్ రోడ్డు: అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన బి.మురళీ వెంకట(40) ఈస్ట్ పాయింట్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ ఒక ప్రైవేటు కంపెనీకి కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. మురళి గత నాలుగు రోజులుగా కనిపించకపోవడం, రూమ్ నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. మురళి నాలుగు రోజుల కిందటే మరణించాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అధిక మొత్తంలో మద్యం సేవించడం వల్లనే మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

24న డ్యాన్సింగ్ సూపర్ స్టార్ గ్రాండ్ ఫైనల్స్



సమావేశంలో మాట్లాడుతున్న రంజన్ నాయక్

డాబాగార్డెన్స్: విశాఖలో డ్యాన్సింగ్ సూపర్ స్టార్ సీజన్ 6 గ్రాండ్ ఫైనల్స్ గురజాడ కళాక్షేత్రం వేదికగా నిర్వహించనున్నట్టు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ ఫౌండర్ రంజన్ నాయక్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 20 ప్రధాన నగరాల్లో ఆడిషన్స్ నిర్వహించామని, 20 టీములను గ్రాండ్ ఫైనల్‌కు ఎంపికయ్యారన్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన న్యాయ నిర్ణేతగా ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష్ వ్యవహరిస్తున్నారని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొంటున్నట్టు తెలిపారు. ఇండియన్ హిప్ హోప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్ బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈవెంట్ ప్రధాన స్పాన్సర్ సునీత మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, టాలెంట్‌ను వెలికి తీసే ఈ తరహా ఈవెంట్లకు మా సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గెలుపొందిన విజేతలకు ఫస్ట్ ప్రైజ్‌గా రూ.లక్ష, సెకండ్ ప్రైజ్‌గా రూ.50వేలు, థర్డ్ ప్రైజ్‌గా రూ.25వేలు అందజేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో ఈవెంట్ హౌస్ మేనేజింగ్ డైరెక్టర్ రవిశంకర్, అగర్వాల్ హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఆడమ్స్, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధి ప్రతీక్‌సింగి, రూపేష్, చాందిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ రచనలతో సామాజిక వికాసం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు

డాబాగార్డెన్స్: మహాకవి శ్రీశ్రీ రచనలతో సామాజిక వికాసం సాధ్యమైందని ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు తెలిపారు. శ్రీశ్రీ 40వ వర్ధంతి పురస్కరించుకొని గురువారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) మద్రాస్‌లో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకొని ముందుగా ఏవీఎన్ కళాశాలలో జువాలజీ విభాగం డిమానిస్ట్రేటర్‌గా పనిచేశారన్నారు. అటువంటి గొప్పవ్యక్తి ఇదే కళాశాలలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం తమ సంస్థకు ఎంతో గౌరవమన్నారు. ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ గోవిందరాజులు మాట్లాడుతూ ఎన్నో కథలు, రచనలు, సంకలనాలు చేసి సమాజ మార్పునకు శ్రీశ్రీ శ్రీకారం చుట్టారన్నారు. గొప్ప వ్యక్తులను స్మరించుకోడవడంతో పాటు వారి జీవన విధానాన్ని నేటి సమాజం తెలుసుకొని జీవించాలన్నారు. ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ విశాఖ నగర అధ్యక్షుడు కె.అభిలాష్ మాట్లాడుతూ యువత నైతిక విలువలతో మెలగాలని, సామాజిక బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. శ్రీశ్రీ సమాజానికి అందించిన సాహిత్య సేవను గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల విద్యార్థినికి గోల్డ్‌మెడల్



కృష్ణవేణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబైలో నిర్వహించిన నేషనల్ రోప్ స్కిప్పింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థి బి.కృష్ణవేణి స్పీడ్ స్ప్రింట్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. డబుల్ అండర్ 30 సెకండ్స్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. కళాశాలలో గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని కృష్ణవేణిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, కళాశాల ఎకనామిక్స్ విభాగాధిపతి డాక్టర్ కేఎల్ శిరీష, బోటనీ విభాగాధిపతి డాక్టర్ ఏహెచ్‌డీ పుష్పలత, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు కృష్ణవేణిని అభినందించారు.

విద్యుత్ వైర్లను చుట్టేస్తున్న తీగలు



బీఎస్ఆర్ నగర్‌లో విద్యుత్ వైర్లను చుట్టుకున్న మొక్కలు, తీగలు

ఆరిలోవ: తోటగరువు దరి బీఎస్ఆర్ నగర్‌లో విద్యుత్ వైర్లను మొక్కల తీగలు చుట్టేసుకుంటున్నాయి. దీంతో ఇక్కడ విద్యుత్ స్తంభాలకు అమర్చిన బల్బుల వెలుగులు కనిపించడంలేదు. దీనికి తోడు తరచూ స్తంభాల వద్ద మంటలు వ్యాపించి కరెంట్ సరఫరా నిలిచిపోతోంది. విద్యుత్ స్తంభాలు చుట్టూ పిచ్చి మొక్కలతో పాటు కొందరు ఇళ్ల ముందు, వెనుక భాగాలలో పెంచిన కూరగాయల పాదులు, పూల మొక్కల తీగలు పైకి పాకుతున్నాయి. ఈ పరిస్థితి కాలనీ మొత్తం ఉంది. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలకు ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.